క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 స్థానాలు ఏకగ్రీవం



ఏకగ్రీవమైన బార్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 స్థానాలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ చెప్పారు. ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి రమేష్, కోశాధికారిగా పూరిళ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కూరెళ్ల సోమశేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఓసూరి జ్యోతి మాంగళ్య, తోట రాజ్యసూర్యలక్ష్మి, కుంచే దుర్గా భవానీ, గోపిరెడ్డి మణి, కురెళ్ల అన్నపూర్ణ, కేఎల్ఎస్ఎస్ నాగశిరీష, ఎం.కాశీవిశ్వనాథ్‌లు ఏకగ్రీవమైనట్టు చెప్పారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మరో మరో నాలుగు పదవులకు ఈ నెల 31న ఎన్నికలు జరుతాయని చెప్పారు.

తాడేరు డ్రెయిన్ ప్రక్షాళన చేపట్టాలి



ఆచంట వేమవరం ఇసుక గరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

పెనుగొండ: తాడేరు డ్రెయిన్‌ను తక్షణం ఆధునికీకరించి, ప్రక్షాళన చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆచంట వేమవరం ఇసుక గరువు తాడేరు డ్రయిన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కౌలు రైతులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహమూర్తి, తలుపూరి బుల్లాబ్బాయి, వెన్నపు ప్రసాద రావు, రైతులు బొమ్మిశెట్టి ఆదినారాయణ, కాండ్రేకుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో స్టీలు బెంచీల ఏర్పాటు



పెనుగొండలో దాతలను సత్కరిస్తున్న మానవత అధ్యక్షుడు విజయరాజు

పెనుగొండ: పెనుగొండలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ దాతల సహకారంతో మానవత స్వచ్ఛంద సంస్థ స్టీలు బెంచీలు ఏర్పాటు చేసినట్లు సంస్థ మండల అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు తెలిపారు. శుక్రవారం నూలి సీతా నాగ వరలక్ష్మీ జ్ఞాపకార్థం కుమారుడు నూలి ధీరజ్, యలమర్తి రాధాకృష్ణ ఆంజనేయ గుప్తా జ్ఞాపకార్థం భార్య సరస్వతి, కొప్పిశెట్టి రంగనాయకమ్మ జ్ఞాపకార్థం డాక్టర్ కొప్పిశెట్టి సూర్యనారాయణ, మొక్కరాల సుబ్రహ్మణ్యం శర్మ జ్ఞాపకార్థం రాధాకృష్ణలు స్టీలు బెంచిలు ఏర్పాటు చేశారు. వీరిని మానవత సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవత జిల్లా సభ్యుడు కర్రి నరేంద్ర రెడ్డి, టీవీకే రంగా రెడ్డి(దొరబాబు), కార్యదర్శి షేక్ మస్తాన్, కోశాధికారి యలమర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహరావు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వర్తక సంఘాల సమస్యలతో పాటు పట్టణ సమస్యల పరిష్కారానికి కూడా ఎంతో కృషి చేస్తుందని చాంబర్ అధ్యక్షులు కారుమూరి వెంకట రత్న నరసింహరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఆదివారం లయన్స్ కమ్యూనిటీ హాలులో ఉదయం 9 గంటలకు సర్వసభ్య సమావేశం, ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులు విచ్చేస్తున్నారన్నారు. 36 సంఘాలతో ఉన్న పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తికావస్తుందని తెలిపారు. సమావేశంలో కె.వి సీతారామరాజు, దేవరపు లక్ష్మీ నారాయణ, రేపాక ప్రవీణ్‌భాను, కొరగింజల రవి, కఠారి నాగేంద్రకుమార్, జంధ్యం ఉప్పరి, జెపి తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలుష్యం నిరోధానికి చర్యలు

- ప్రతిరోజూ 45లక్షల లీటర్ల నీరు సరఫరా
- వ్యాధులను అరికట్టడమే లక్ష్యం


పాలకొల్లు అర్బన్: మండలంలోని గ్రామాలన్నీ ప్రధాన పంట కాలువలకు శివారున ఉన్నాయి. రాపాక చానెల్, దిగమర్రు చానెల్, గోరింటాడ ఓల్డ్ నెం.3 చానెల్, మొగల్తూరు, భగ్గేశ్వరం పంట కాలువ, చీమలకోడు, దిగమర్రు బ్రాంచ్ కెనాల్‌ల ద్వారా మండలంలోని మంచినీటి చెరువుల్లోకి నీరు వెళ్తుంది. అక్కడ నుంచి రక్షిత మంచినీటి పథకాల ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ కాలువల నుంచి వచ్చే చెత్తాచెదారాలతో నీరు కలుషితమై ఆ నీటినే ప్రజలకు సరఫరా చేయడంతో అనారోగ్యం పాలవుతునన్నారు. దీని నివారణకు గ్రామీణ నీటి సరఫరా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పలు చర్యలు తీసుకుని ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

నీటి ద్వారానే వ్యాధులు

కలుషిత నీటిని ప్రజలు తాగడం వల్ల 60 శాతం పైగా రోగాలు వచ్చే అవకాశాలున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. దీనికి అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల ద్వారా ఇంటింటి ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలు కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు డయేరియా, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి విష జ్వరాలకు గురికావడానికి కలుషిత జలాలే కారణమని చెబుతున్నారు. పాలకొల్లు మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో 23 మంచినీటి చెరువులున్నాయి. గ్రామీణ నీటి సరఫరా పథకం కింద 36 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. వీటి ద్వారా ప్రతి రోజూ 40 నుంచి 45లక్షల లీటర్లు శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అలాగే వాలమర్రు, కాపవరం, వడ్లవానిపాలెం, పాలకొల్లు రూరల్, గవరపేట, అరట్లకట్ట గ్రామాల్లోని ప్రజలకు బోరు నీరు ఫిల్టర్ చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు.

నీటి పథకాల శుద్ధి ఇలా

గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలను ప్రతి 15 రోజులకు ఒకసారి శుద్ధి చేస్తున్నారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ముందు క్లోరినేషన్ పరీక్షలు చేసి ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రారంభంలో 2 పీపీఎం క్లోరినేషన్, అలాగే చివరిలో 0.2 పీపీఎం క్లోరినేషన్ ఉండేలా వైద్య ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల ఎఆలాంటి రోగాలు దరి చేరవని వైద్యులు సూచిస్తున్నారు. మంచినీటి చెరువుల్లో నీటి సాంద్రత (నీరు చిక్కబడితే) తగ్గించడం కోసం పటిక, ఇసుక కలిపిన మూటలను చెరువులోని నాలుగు మూలల కట్టి ప్రజలకు సురక్షితమై నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.



దిగమర్రులో రక్షిత మంచినీటి పథకం శుద్ధి చేస్తున్న దృశ్యం



కాపవరంలో రక్షిత మంచినీటి పథకం శుద్ధి చేస్తున్న దృశ్యం

కలుషిత నీటితో అనారోగ్యం



వర్షాకాలంలో నీరు కలుషితమవ్వడం సహజం. అధిక వర్షాల వల్ల, వరదలు సమయంలో నీటి ప్రవాహంతో అనేక రకాల మలినాలు కలిసి నీరు కలుషితమవుతుంది. దీని నివారణకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో ఆశ, ఏఎన్ఎంల ద్వారా ప్రచారం చేసి ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పిస్తున్నాం. – ఎం.నవ్యజీవన్, మెడికల్ ఆఫీసర్, లంకలకోడేరు

మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి

మొగల్తూరు: మహిళా సాధికారత కోసమే కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకం ప్రవేశపెట్టిందని మహిళ శిశు సంక్షేమ అధికారిణి ఊర్మిళ తెలిపారు. మిషన్ శక్తి 100 రోజులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందర్భంగా సీడీపీఓ ఊర్మిళ మాట్లాడుతూ పోక్సో చట్టం, బాలల హక్కులు, బాధ్యతలను వివరించారు.మిషన్ శక్తి అనేది మహిళల భద్రతపై దృష్టి సారించే పథకమన్నారు.బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: బాల్యవివాహాలతో చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు వస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమతులసి అన్నారు. మిషన్‌శక్తి 100 రోజుల పోగ్రాంలో భాగంగా శుక్రవారం జిన్నూరు ఏఎస్ఆర్ జెడ్పీహైస్కూల్లో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమతులసి మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, స్క్రీన్ టైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగపద్మావతి, మోహనరాణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, బాల్యవివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమాన్ని శుక్రవారం పెనుగొండలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే ఎం కుసుమ, కె.ఉమ, డి.పద్మలత, కె.కుసుమ పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయని ఐసీడీఎస్, పాలకొల్లు ప్రాజెక్టు అధికారి సీహెచ్ ఇందిర అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కిశోరబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో మిషన్ శక్తి 100 ఆకారంలో విద్యార్థినులు కూర్చుని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఏఎన్ఎం అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, జీఎస్ మల్లేశ్వరి, ఎన్ మంగ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: బాలురుతో సమానంగా బాలికలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. ఏనుగువానిలంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం ఆమె బేటీ బచావో–బేటీ పఢావో మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అవధాని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంద్రాణి, మాణిక్యం, సీత, సరోజిని తదితరులు పాల్గొన్నారు.



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పోడూరు: జిన్నూరు ఏఎస్ఆర్ జెడ్పీహైస్కూల్లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పెనుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



యలమంచిలి: ఏనుగువానిలంక హైస్కూల్లో 100 ఆకారంలో కూర్చున్న విద్యార్థినులు

నేటి సాయంత్రం మంచినీటి సరఫరా నిలిపివేత

నరసాపురం: పట్టణంలో వాటర్‌వర్క్స్ కార్యాలయంలో మరమ్మతులు కారణంగా శనివారం సాయంత్రం కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా నిలిపేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం నుంచి మళ్లీ యథావిధిగా మంచినీటి సరఫరా ఉంటుందని వివరించారు. పట్టణవాసులు ఈ విషయాన్ని గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

కొప్పర్తి కాంప్లెక్స్‌లో 4 షాపులకు తాళాలు

నరసాపురం: పట్టణంలోని పార్కురోడ్డులో ఉన్న కొప్పర్తి వేణుగోపాల్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో దీర్ఘకాలంగా అద్దెబకాయాలు పెట్టిన నలుగురు లీజుదారులకు చెందిన షాపులకు శుక్రవారం మున్సిపల్ అధికారులు తాళాలు వేశారు. మున్సిపల్ ఆర్ఐ నానాజీ సిబ్బందితో కలిసి వెళ్లి షాపులకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె బకాయిఅల చెల్లించమని అనేకసార్లు మాట్లాడినా, నోటీసులు పంపినా స్పందించక పోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు

నరసాపురం: బాలికలపై అఘాయిత్యాలు విచ్చలవిడిగా సాగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పాగాకు పూర్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు అరికట్టాలని కోరుతూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ఇటీవల విశాపట్టణం, విజయనగరం జిల్లాలలో చిన్నచిన్న పిల్లలపై తాత వయసున్న వ్యక్తులు అత్యాచారాలు చేసిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ ఘనటల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్ జయప్రభ, బూడిద భువనేశ్వరి, విజయకుమారి, నాగమణి, అనసూయ పాల్గొన్నారు.

అమ్మవార్లకు శాకంబరి అలంకరణ

నరసాపురం/మొగల్తూరు: పట్టణంలోని కోటవద్ద పాలెం వద్ద ఉన్న శ్రీ కొండాలమ్మ అమ్మవారిని శుక్రవారం శాకంబరీ అలంకరించారు. ఆషాఢమాసం శుక్రవారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేసి, పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మొగల్తూరు భవానీ కాలనీలోని కనకదుర్గమ్మను శాకంబరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామశేషు, రామ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి భక్తులతో సామూహికంగా పూజలు జరిపించారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో ప్రతిభ ఉంటే ఎక్కడ చదివిన ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రిటైర్డ్ ఉపాధ్యాయులు జీవీ బ్రహ్మానందరావు అన్నారు. శుక్రవారం తాను పదవీ విరమణ చేసిన స్థానిక బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో బయెలాజికల్ సైన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు వివిద సేవా సంస్థలు, దాతల సహకారం ఎంతో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదో తరగతిలో బయెలాజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపిన 32 మంది విద్యార్థినులకు నగదు అందించారు. అందజేశారు. అలాగే యుటిఎఫ్ భవనం నిమిత్తం రూ. 25,116లు విరాళంగా సంఘ సభ్యులకు అందజేశారు. ఈ పాఠశాల నుంచి ట్రిపుల్ ఎంపికైన 8 మంది విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ప్రభాకరశాస్త్రి ఇంగ్లీషు గ్రామర్ పుస్తకాలను అందజేశారు. అలాగే వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నగదు బహుమతులను అందిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీ రత్నం, విజయలక్ష్మి, కె. పద్మావతి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీకేవీ రామభద్రం, జిల్లా కార్యదర్శి జి.లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు బ్రహ్మానందరావు

డీఎన్నార్ కళాశాలలో పీసీఓఎస్‌పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ప్రసూతి సమయంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల పీసీఓఎస్ (పాలిసిస్టిక్ ఓవరిన్ సిండ్రోమ్, నీటి బుడగలతో) ఇబ్బందులు పడుతున్నారని ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీభార్గవి అన్నారు. శుక్రవారం స్థానిక డీఎన్నార్ మహిళా డిగ్రీ కళాశాలలో మాన్‌కిండ్ ఫార్మా ఆధ్వర్యంలో పీసీఓఎస్ (నీటి బుడగలు)పై అవగాహనా సదస్సు నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీభార్గవి మాట్లాడుతూ నీటిబుడగ అనేది పెద్దగా ఇబ్బందిపడే వ్యాధి కాదని కానీ దీనిపై నిర్లక్ష్యం చేస్తే ఓబెసిటీ, డయాబెటిక్, పిల్లలు పుట్టకపోవడం వంటి ఇబ్బందులు వస్తాయన్నారు. ప్రస్తుతం ప్రసూతి కాలంలో ప్రతీ వంద మంది స్త్రీలలో 25 మంది నీటి బుడగల సమస్యతో బాధపడుతున్నారన్నారు. దీనికి ప్రధానకారణం విద్యార్థుల్లో అధిక ఒత్తిడి, సరైన వ్యాయామం లేకపోవడం, ఫుడ్ హ్యాబిట్స్ అని వివరించారు.

బ్యూటీషియన్ కోర్సుల్లో విజేతలుగా డీఎన్నార్ విద్యార్థినులు

స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు బ్యూటీషియన్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ కళాశాలలో 2023 సెప్టెంబర్ నుంచి 2024 ఏప్రియల్ వరకూ ఎనిమిది నెలల పాటు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు ప్రధానమంత్రి కౌశల్ వికాశ యోజన సంయుక్తంగా నిర్వహించిన ఆఫీస్ అసిస్టెంట్, బ్యూటీషియన్ కోర్సుల్లో తమ విద్యార్థినులు ఉతీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నడపన జగపతి, కె. వెంకట్, కో ఆర్డినేటర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, వారిజ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.



డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న లక్ష్మీభార్గవి

శాంతించిన వశిష్ట గోదావరి

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి శాంతించింది. గురువారంతో పోలిస్తే శుక్రవారం నాటికి నీటిమట్టం భారీగా తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిచేరుతున్న వరదనీరు అంతే వేగంతో సముద్రంలోకి వెళ్లిపోతుంది. దీంతో స్థానికంగా ప్రవాహ ఉధృతి కాస్త ఎక్కువగా ఉన్నా కూడా నీటిమట్టం తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వలంధర్‌రేవు, లలితాంబ ఘాట్, పడవలరేవు ప్రాంతాలకు ఎవరినీ అనుమతించలేదు. వలంధర్‌రేవు, లలితాంబ ఘాట్‌ల వద్ద స్నానాలకు అనుమతించడంలేదు. రేవుల వద్ద పోలీసు బందోబస్తు పెట్టారు. ప్రవాహ వేగం ఉధృతంగా ఉండడంతో పంటు రాకపోకలను నిలిపేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: గోదావరి తగ్గుముఖం పట్టింది. సిద్ధాంతం, కోడేరు, లంక గ్రామాల్లో గోదావరి నీటి మట్టం వేగంగా తగ్గడం ప్రారంభించింది. దీంతో నీటి మునిగిన కొబ్బరి తోటలు, అరటి తోటలు, కూరగాయల తోటలు వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. ఈ ఏడాది ఇళ్ల మధ్యలోకి పూర్తిస్థాయిలో గోదావరి వరద రాకపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. సిద్ధాంతం కేదారీఘాట్‌లో పుష్కర రేవు లో నీటి మట్టం తగ్గుతుంది. మధ్యస్థ లంకకు రైతులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఏటి గట్టు పొడవునా లంక భూములు వరద ముంపు నుంచి బయటకు రావడంతో రైతులు వరద నీటిని పూర్తిగా బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాడి పశువులకు మాత్రం పశుగ్రాస కొరత ఏర్పడింది. పశుగ్రాసం పూర్తిగా వరద నీటిలో మునిగిపోవడంతో బురదగా మారింది. ఎగువ నుంచి సైతం వరద నీరు రాక సైతం తగ్గడంతో ఇప్పట్లో మరోసారి వరద ఉధృతి ఉండకపోవచ్చని లంక గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. వరద పూర్తిగా తగ్గే వరకూ అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు సూచనలు చేస్తున్నారు.



వలంధర్‌రేవులో భారీగా తగ్గిన నీటిమట్టం



సిద్ధాంతంలో మధ్యస్థ లంకలోకి పడవలపై రైతుల రాకపోకలు



సిద్ధాంతం కేదారీఘాట్ పుష్కర రేవు వద్ద గోదావరి వరద నీరు

కనకరత్నమాలకు డాక్టరేట్



కొత్త కనకరత్నమాల

పెనుగొండ: ఆచంట మండలం భీమలాపురం శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవా మండలి అధ్యక్షురాలు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ సిటిజన్ అధ్యక్షురాలు కొత్త కనక రత్నమాల సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి తమిళనాడుకు చెందిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో గౌరవించింది. ఈ మేరకు కొత్త కనక రత్నమాల శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 41 సంవత్సరాలుగా తాను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు వివరించారు. డాక్టరేట్ మరింత సామాజిక బాధ్యతను పెంచిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

నేడు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. హెటిరో ల్యాబ్స్ సంస్థ ప్రతినిధులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 2020 నుంచి 2024 సంవత్సరాల్లో బీఎస్సీ కెమిస్ట్రీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. సంబంధిత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్ జిరాక్స్‌తోపాటు 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం 99120 46234 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.